# “నేను ప్రభువును చూచితిని”

# (20:1-31)

నేను కాలేజీలో ఉన్నప్పుడు యౌవనుల కూడికలో పని చేయుట కొరకు విద్యార్థుల బృందంతో వేరే రాష్ట్రం ఒకసారి వెళ్లాను. మా గమ్యం చేరుకొనడానికి రాత్రంతా కారు నడుపుకొంటూ వెళ్లుతుండగా, చాలా గంటలు మా విశ్వాసపు యాత్రలను గూర్చి మాట్లాడుకొనడం జరిగింది. కారులో ఉన్న కొందరు క్రైస్తవ గృహంలో పెంచబడినవారు, తక్కినవారు తమ కుటుంబాల్లో క్రైస్తవులైనవారు. కొందరు సందేహాలతో ఎక్కువగా పెనుగులాడవలసి వచ్చింది, కొందరికి ఆ బాధలు లేవు. కొందరు ఇటీవల యేసు క్రీస్తునందలి విశ్వాసానికి తమ జీవితాలను సమర్పించుకున్నవారు మరికొందరైతే పది సంవత్సరాలకు పైగా క్రైస్తవులైయున్నవారు.

మేము మా కథలను ఒకరితో నొకరం పంచుకొంటూ ఉండగా, హైస్కూలు బయాలజీ క్లాసులో తన విశ్వాసాన్ని కోల్పోయిన ఒక బాలిక యొక్క ప్రతిపాదన నా మీద గొప్పగా ప్రభావాన్ని కనపరచింది. దేవునియందలి ఆమె విశ్వాసాన్ని అపహాస్యం చేస్తున్న టీచరుకు భయపడి, విశ్వాసానికి మరో అవకాశం యివ్వడానికని ఆమె సువార్త రచనలను మరోసారి చదువ బూనిందట. “ఇది నిజమేనా, లేక యింత మంచి కథను ఎవరైనా అల్లారా? యేసు అనే మనిషి ఎప్పుడైనా జీవించాడా? ఒకవేళ జీవించాడే అనుకో, ఆయన నిజంగా దేవుని కుమారుడేనా?” అని ఆమె ఆశ్చర్యపోయిందట. చాలా మాసాలు ఆమె ఈ ప్రశ్నలతో పెనుగులాడిందట. చివరకు ఆమె ఒక స్వల్పమైన, అయినా గంభీరమైన ఒక తీర్మానానికి వచ్చి చేరుకుందట. సువార్త సందేశము పునరుత్థానం మీద ఆధారపడి తిరుగుతున్నట్టు ఆమె గ్రహించింది. యేసు మృతులలోనుండి లేచియున్నట్టయితే, యిదంతా సత్యమే: అంటే, ఆయన అద్భుతాలను జరిగించాడు, ఆయన నిజంగా దేవుని కుమారుడే. ఆయన మృతులలోనుండి లేవకున్నట్టయితే, అది కేవలం ఒక కట్టు కథయు లేక భయంకరమైన మోసమునైయుంది.

ఆమె రైటు. సువార్త రచనలు అధికార పూర్వకంగా చెప్పుకునేవి (ఈ సందర్భంలో యోహాను సువార్త చెప్పేది) యేసు పునరుత్థానమనే సత్యం మీద నిలుస్తాయి లేక పడిపోతాయి. పౌలు దాన్ని ఈ విధంగా చెప్పాడు:

> … దేవుడు తన కుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తు విషయమైన ఆ సువార్తను పరిశుద్ధ లేఖనములయందు తన ప్రవక్తల ద్వారా ముందు వాగ్దానముచేసెను. యేసు క్రీస్తు, శరీరమునుబట్టి దావీదు సంతానముగాను, మృతులలోనుండి పునరుత్థానుడై నందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింప

బడెను (రోమా 1:2-4).

మనమిప్పుడు యోహాను చెప్పిన విశ్వాస సువార్త అగ్ర భాగానికి చేరుకున్నాం. మనం యేసు పునరుత్థానాన్ని ఎదుర్కొంటున్నాం ఇది చిన్న విషయం కాదు తక్కినవన్నీ నిరాధారాలు!

పునరుత్థానాన్ని గూర్చిన యోహాను యొక్క వివరణ సూటిగా చెప్పబడినదై, పునరుత్థానుడైన ప్రభువు యొక్క నాల్గు వేరైన ప్రత్యక్షతల మీద నిలబడింది. ప్రతి ఒక్కటి ఆ చిత్రంలోనికి ఏదో ఒక క్రొత్తదనాన్ని ప్రవేశపెట్టుతుంది. 20వ అధ్యాయపు ఆరంభమందు పునరుత్థానాన్ని గూర్చిన ప్రశ్నలను చేపట్టి వారిని గమనించుతున్న ప్రేక్షకులనుగా మనలను గూర్చి మనం ఆలోచించుకొనవచ్చు. అయితే, ఆ అధ్యాయం యొక్క అంతానికి వచ్చేసరికి మనమే ఆ పటంలోని కేంద్రం దగ్గర నిలిచినట్టు మనకు మనమే కనుగొంటాం యేసును గూర్చి తీర్మానించుకోవలసిన స్థితిలో అది మనలను ఉంచుతుంది!

## పునరుత్థానము, మగ్దలేనే మరియ (20:1-18)

ప్రభువైన యేసు యొక్క సిలువ మరణం తరువాతి ఆదివారం, ఇంకా చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ సమాధి వద్దకు వచ్చింది. ఆ సమాధిని మూసిన రాయి తొలిగింపబడియుండడం చూచి, ఆమె పరుగెత్తికొని పేతురు యోహానుల ("యేసు ప్రేమించిన మరియొక శిష్యుడు") వద్దకు వచ్చి "-ప్రభువును సమాధిలోనుండి యెత్తికొనిపోయిరి, ఆయనను ఎక్కడ ఉంచిరో యెరుగమని చెప్పెను" (20:2). ఆమె భక్తిగల శిష్యురాలుగా ప్రభువు బోధను బహు శ్రద్ధగా ఆలకించినదే అయినా, ఆ ఉదయ కాలమున పునరుత్థానం భావన ఆమె మనస్సునకు తట్టినట్టు కన్పించదు. ఖాళీ సమాధి ఉన్నందున ఆమెకు సాధ్యంగా కన్పించే ఒకే ఒక వివరణ, ఆయన దేహాన్ని ఎవరో దొంగిలించియుంటారనేదే.

మరియ యొక్క రిపోర్టును విన్న పేతురు యోహానులు సమాధి వద్దకు పరుగెత్తుకొంటూ వచ్చారు. ఆ యిద్దరిలో ముందుగా పరుగెత్తిన యోహాను సమాధి యొద్దకు చేరి దాని ముఖ ద్వారము ఎదుట నిలిచాడు. పేతురు సమాధి వద్ద అతని కలిసికొని, సమాధిలోపలికి తీసికెళ్లాడు (అది పేతురు యొక్క సహజ స్వభావాన్ని తెలుపదా?) నారబట్టలు పడియుండుటయు, ఆయన తల రుమాలు నారబట్టలయొద్ద ఉండక వేరుగా ఒకచోట చుట్టిపెట్టియుండుటయు చూచారు. ఆ సమయంలో, యోహాను కూడా సమాధిలో ప్రవేశించి, విశ్వసించాడు. ఏదియెలాగున్నా, మెస్సీయా మూడవ దినాన మృతులలోనుండి లేపబడడం అగత్యమన్న లేఖనాలను శిష్యులు యింకను గ్రహింపరైరి. దాన్ని గ్రహించడం పేతురు యోహానులకు అతీతంగా ఉన్నట్టుంది.

ఆ యిద్దరు శిష్యులు తమ విడిదికి తిరిగి వచ్చిన తరువాత, మరియ సమాధి వద్ద ఏడ్చుచు నిలిచియుంది. ఆమె ప్రభువును గాఢంగా ప్రేమించినవారిలో ఒకతె. తన గాయానికి సమాధి దొంగలు అవమానాన్ని జత చేసినట్టు తలుస్తుంది. అంతకన్న

భయంకరమైనది వేరే ఏదైనా ఉన్నట్టు తాను ఊహించలేకయుంది. ఆమె ఏడ్చుతూ, సమాధిలోనికి తొంగి చూచింది. గతంలో ప్రభువు యొక్క తల, కాళ్లు పెట్టినట్టున్న స్థలంలో యిద్దరు దూతలు కావలివారిలా ఆమెకు కన్పించారు. ఆమె ఎందుకేడుస్తోందో వారామెను అడిగినప్పుడు, "–నా ప్రభువును ఎవరో యెత్తికొని పోయిరి; ఆయనను ఎక్కడ ఉంచిరో నాకు తెలియలేదని చెప్పెను" (20:13).

ఈ సందర్భంలో యేసు మృతదేహం లేకుండపోయింది అనే విషయం నొక్కి చెప్పబడుతుందని గమనించాలి. ఇది చిన్న వివరణ ఏమీ కాదు! రాబోయే తరముల వారికి అది ప్రధానమైన రుజువై నిలుస్తుంది. యోహాను 20తో పాటు, అపొస్తలుల కార్యాల్లోని తొలి అధ్యాయాలు చదువబడినట్టయితే, క్రైస్తవ్యం ప్రబలకుండ నిలుపు చేయడానికి వ్యతిరేకులకు ఎంతటి సులభమైన మార్గం ఉండేదో మనం గమనింపవచ్చు: వారు చేయవలసిందంతా యేసు మృత దేహాన్ని కనుపరచడమే. క్రైస్తవ్యం వ్యాపింప బడకుండ తక్షణమే నిలుపు చేయబడేదే. వారు దాన్ని చేయలేకపోయారు. నిజంగా వారు ఆయన దేహాన్ని చూపించగలవారై ఉన్నట్టయితే, చూపించేవారే. కన్పించని యేసు మృతదేహం ఆయన పునరుత్థానానికి ప్రధానమైన రుజువుగా నిలిచియుంటుంది.

ఈ మాటలు చెప్పిన తరువాత మరియ వెనుక తట్టు తిరిగి, యేసు నిలిచియుండుట చూచింది. అయితే ఆయన యేసు అని గుర్తుపట్టలేదు. ఆ సమాధియున్న భూభాగంలోని తోటకు తోటమాలియనే భావంతో, "–అయ్యా, నీవు ఆయనను మోసికొని పోయినయెడల ఆయనను ఎక్కడ ఉంచితివో నాతో చెప్పుము, నేను ఆయనను ఎత్తికొని పోదునని చెప్పెను" (20:15). అప్పుడు యేసు, "మరియా!" అని ఆమెను పేరుతో పిలిచాడు. ఆ సందర్భంలో, తొలిసారి ఆమె పునరుత్థానుడైన ప్రభువుతో మాట్లాడుతున్నట్టు గ్రహించింది.

ప్రభువు యొక్క పెదవుల మీద ఉచ్చరింపబడిన పేరు మరియ విన్నప్పుడు, "రబ్బూనీ" అని ఆమె ఆయనకు ప్రత్యుత్తరమిచ్చింది అంటే "బోధకుడా" అని అర్థం. ఆమె ఆయనను ముట్టుకోవాలనుకుంది. దానికి ఆయన ఆమెకు అనుమతి యియ్యక, ఆయన యింకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదని చెప్పాడు (20:17). తోటను విడిచి, ఆమె శిష్యుల వద్దకు త్వరగా వచ్చి, "–నేను ప్రభువును చూచితినని" చెప్పింది (20:18). గొప్ప బోధకుని యందలి మరియ విశ్వాసం పునరుత్థానుడైన ప్రభువునందలి విశ్వాసంగా మారిపోయింది!

## పునరుత్థానం, మేడగదిలోని శిష్యులు (20:19-24)

పునరుత్థానపు ఆదివారం శిష్యులకు చాలా దీర్ఘమయినదిగాను తికమకగా ఉన్న దినంగాను గోచరించింది. ఆ సాయంకాలమున వారు తలుపులు మూయబడిన గదిలో ఉన్నారు. యేసును చంపిన యూదా మత నాయకుల భయము వారిని వెంటాడుతుంది. మగ్దలేనే మరియ రిపోర్టు ఉద్వేగంతో బాధింపబడిన వ్యక్తి యొక్క వింత పలుకులుగా వారికి గోచరించాయి. ఆయన మృతదేహం ఎక్కడ ఉందో వారికి యింకా తెలియలేదు. అయితే వారి హృదయాలకు సంబంధించి యేసు చనిపోయినట్టు స్థిరం చేసికొన్నారు. తమ యజమానుడు ద్వేషింపబడి క్రూరంగా చంపబడగా, భయమనేది శిష్యులయొక్క

సహజమైన స్థితిగా ఉంటుందని మనం గుర్తించాలి. నేడు కూడా, క్రైస్తవులు భయ భీతులతో జీవిస్తున్నట్టయితే, వారి యజమానుడు యింకను సమాధిలో ఉన్నాడన్న భావనయే కలుగుతుంది.

తలుపులు వేయబడిన గదిలో శిష్యులు కూడియుండగా, ఆ గదిలో ప్రభువు తటాలున ప్రత్యక్షమయ్యాడు. "మీకు సమాధానము కలుగునుగాక" అంటూ ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపాడు (20:19) మరియు తన కాళ్లలోను చేతులలోను ఉన్న మేకుల గురుతులను ఆయన వారికి చూపాడు. "శిష్యులు ప్రభువును చూచి సంతోషించారు" (20:20). "సమాధానము," "సంతోషము," "భయము"లనేవి యోహాను సువార్తలోని గత భాగాన్ని విశ్వాసం యొక్క సందర్భంలో గుర్తు చేసికోవాలి. అక్కడ ప్రభువైన యేసు తన మరణము పునరుత్థానాలనే వాటిని ప్రవచించాడు:

> శాంతి మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీ కనుగ్రహించుచున్నాను; లోకమిచ్చునట్టుగా నేను మీ కనుగ్రహించుటలేదు; మీ హృదయమును కలవరపడ నియ్యకుడి, వెరవనియ్యకుడి. "నేను వెళ్లి మీయొద్దకు వచ్చెదనని" మీతో చెప్పిన మాట మీరు వింటిరి గదా. తండ్రి నాకంటె గొప్పవాడు గనుక మీరు నన్ను ప్రేమించిన యెడల నేను తండ్రియొద్దకు వెళ్లుచున్నానని మీరు సంతోషింతురు. ఈ సంగతి సంభవించినప్పుడు, మీరు నమ్మవలెనని అది సంభవింపకముందే మీతో చెప్పుచున్నాను (14:27-29).

చివరిగా, పునరుత్థానపు సాయంకాలమున మూయబడిన తలుపుల వెనుక కూడియున్న శిష్యులకు ప్రభువు ప్రత్యక్షమైనప్పుడు, అద్భుతమైన బోధకుడు, గొప్ప ప్రవక్త అనే దానికంటెను, ఆయన పునరుత్థానుడైన మెస్సీయా అనియు, నిజముగా దేవుని కుమారుడనియు వారు గుర్తెరిగారు! వారి భీతి అంతరింప నారంభించింది. వారి సంతోషము తిరిగి వస్తుంది. దేవుని అద్భుతమైన సమాధానము వారు అనుభవింప నారంభించారు.

## పునరుత్థానము, తోమా (20:24-29)

ప్రభువు తన పదిమంది శిష్యులకు ప్రత్యక్షమైన ఆ సమయంలో, తోమా వారితో కూడ లేదు. అతడు వారి యొద్దకు వచ్చినప్పుడు, మరియ వారికి చెప్పిన సంగతియు, మరియు "మేము ప్రభువును చూచితిమనే" సంగతియు అతనితో చెప్పారు (20:25). ఒకప్పుడు తోమా ప్రభువునందు గట్టిగా నమ్మికగలవాడైనా,[1] కథలోని ఈ భాగమందు అతని హృదయం కఠినమయ్యింది, సందేహవాదిగా మారిపోయాడు. ఒక సమయంలో, యేసు యొక్క పరలోక సంబంధమైన వాస్తవపు దృష్టిలో అతడు పాలుగలవాడైయున్నాడు. అయితే నిరాశలు గాఢమైన దెబ్బలు తినడం లాంటివి అతన్ని భూ సంబంధమైన దృక్పథానికి తరిమాయి. అందువలన వారు వినిపించిన సందేశం పట్ల తోమా యిలా గట్టి పట్టుపట్టాడు: "-నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే

నమ్మనని వారితో" చెప్పాడు (20:25).

అతని సందేహవాదం విషయంలో తోమాను విమర్శించడం చాలా సులభం. ఇంతకూ సత్యమేమంటే, అతడు వ్యక్తపరచిన భావాలతో మనమందరం బాగా పరిచయమున్న వారమే, మనం ఏదైనా నమ్మాలంటే, నిర్ణయం తేలికగా తీసికొనకూడదు. పునరుత్థానుడైన ప్రభువును మనకు మనమే చూచి తాకవలసియుంది. మన సొంత అనుమానాలను ఎదుర్కొనడానికి తోమా మనకు సహాయపడతాడు. మరియు మనము వాటిని దాటి వెళ్లడానికిని సహాయం చేస్తాడు.

ఎనిమిది దినాలవరకు తోమా తన సందేహవాదపు భావాలను మాటిమాటికి వ్యక్తపరచినా, శిష్యులు తిరిగి అలాగే తలుపులు మూయబడిన గదిలో మరలా కూడియున్నారు. మరల ప్రభువు ప్రత్యక్షమైనప్పుడు తోమా వారితో కూడ ఉన్నాడు. తోమా యొక్క సందేహాలను ఎదుర్కొంటూ, తన చేతులు చాపి అందులో తన వ్రేలిని పెట్టుమనియు, తన ప్రక్కను చూపి అందులో తన చెయ్యి ఉంచుమనియు, తోమా కోరినట్టే ప్రభువు వానికి అవకాశమిచ్చాడు. అప్పుడు, తోమా "నా ప్రభువా, నా దేవా" (20:28) అని ఒప్పుకున్న దానియంతటిలో ఇది బహు గొప్ప ఒప్పుకోలైయుంది. ఒకప్పుడు తీవ్రంగా నిరాశచెంది మొండి హృదయంగా మార్చుకున్న సందేహపరుడిలో ఇది రావడం యిందులో ప్రత్యేకత.

తోమా ఒప్పుకోలు వెంట, నేటి మన పరిస్థితిని వర్ణించే ఒక విషయాన్ని ప్రభువు తెలియజేశాడు. ఆయన అతనితో యిలా అన్నాడు: "–నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులని అతనితో చెప్పెను" (20:29). తోమా కోరిన రుజువు నేడు మనం కూడా కావాలని కోరవచ్చు. కాని నేడు అది సాధ్యపడదు, ఎందుకంటె తండ్రితో ఉండడానికి ప్రభువు ఆరోహణుడై తేజోమయుడయ్యాడు. మన విశ్వాసము వేరే మరో దానిమీద ఆధారపడియుండాలి. తోమాకును యితర శిష్యులకును ఆనాడు మేకుల గురుతులు ఎలాటివో, నేడు మనకు యోహాను సువార్త రచన ఆలాటిది: పునరుత్థానుడైన ప్రభువును సంధించే మార్గం నేడు యిది ఒకటి. నేడు ఆయనను మనం ముఖా ముఖిగా చూడలేకపోయినా, ఆయన సాక్షులతోను, ఆయన ఉపదేశాలతోను, అధికారపూర్వకంగా ఆయన తన్నుగూర్చి చెప్పుకున్న వాటితోను వ్రాయబడిన దేవుని వాక్యపు శక్తితోను ఆయన మనలను సంధిస్తాడు.

## పునరుత్థానం మరియు మనం (20:30, 31)

20:30, 31లో, యోహాను సువార్త అంతటి ఉద్దేశాన్ని తెలియజేసే ప్రతిపాదన వద్దకు మనం వచ్చి చేరుకున్నాం:

> మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను.

అనేకమైన యితర "సూచక క్రియలను" యేసు తన శిష్యులయెదుట చేసెననే విషయం అతడు స్పష్టంగా చెప్పాడు, అయితే ఈ సువార్త రచనలో దాఖలు చేయబడిన ఏడు సూచక క్రియలతో[2] దాచబడిన ఉద్దేశం భవిష్యత్ తరాలలో విశ్వాసాన్ని పుట్టించడమే. ఈ సువార్త "రచన ద్వారా" యేసు యొక్క కథను ఎరిగి, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్మవచ్చు, అలా నమ్మి ఆయన నామమందు జీవము పొందవచ్చు. యోహాను సువార్త ప్రత్యేకమైన ఉద్దేశంగల అభ్యాస సంబంధమైన పుస్తకం.

నాలుగు సువార్త రచనలలోను పునరుత్థాన వివరణలో ప్రభువైన యేసు సమాధిలో నుండి వచ్చినప్పుడు నిజంగా ఎవరును చూచినట్టు తెలుపబడలేదు. ఆయన చంపబడినట్టు అనేకులు చూచారు, మరియు ఆయన ఆరోహణం తరువాత అనేకులు చూచారు, కాని ఆయన సమాధిలోనుండి వెలుపలికి వస్తుండగా చూచినట్టు నేరుగా కన్పించదు. ఆది అపొస్తలులవలె మనమును మన నిర్ణయాలు చేసికోవాలి. ఆ కాలేజి ఫ్రెండ్ ఒక రోజు నాతో చెప్పినట్టు, "ప్రతి ఒక్కటి పునరుత్థానం మీద అధారపడి ఉంది. అది నిజమైతే అంతా నిజమే. అదే అబద్ధమైతే, అప్పుడు అందులో ఏమీలేదు."

## ముగింపు

ఎన్నడే విశ్వసింపని వారిలో విశ్వాసాన్ని పుట్టించడానికి వ్రాయబడిందో, లేక బలహీన పడుతున్నవారి విశ్వాసం పెంచడానికి యోహాను వ్రాశాడో అనేదానిమీద పండితులు దీర్ఘకాలంగా చర్చిస్తున్నారు. "మీరు నమ్మునట్లును" అనేదాని భావం "మీరు విశ్వసింప నారంభించునట్లు" లేదా "మీరు విశ్వాసంలో కొనసాగునట్లును" అని అర్థమో? యోహాను సువార్తలో యిదా? లేక అదా? అనే ప్రశ్న వచ్చినప్పుడు జవాబు తరచుగా "రెండును" అని అర్థమిస్తుంది. ఇంతకు ముందు లేని విశ్వాసాన్ని పుట్టించడానికి యోహాను నిశ్చయంగా వ్రాశాడు. అదే సమయంలో, విశ్వాస విషయంలో అలసిపోయిన, సతమత మౌతున్న, బలహీనంగాను, పిరికితనంగాను ఉన్న విశ్వాసాన్ని సువార్త రచన సంబోధిస్తుంది.

క్రొత్తగా పుట్టిన తన తమ్ముని తనకు అప్పగించమని తన తల్లిదండ్రులను అడిగిన నాలుగేండ్ల చియ అనే బాలిక కథను యోహాను యిష్టపడతాడని నేను తలంచుతున్నాను. మొదట్లో అలా చేయడానికి ఆమె తల్లిదండ్రులు వెనుకంజ వేశారు. తన తమ్మునితో ఆ బాలిక ఎంతో సున్నితంగా, దయగా ఉండడం ఆమె తల్లిదండ్రులు గమనించినప్పుడు, వారు సమ్మతించారు. తలుపులో ఉన్న చిన్న సందుగుండా వారు జిజ్ఞాసగా తొంగిచూడగా, చియ ఆ చిన్న గదియొద్దకు నడిచిపోయి "బేబీ, దేవుడు ఎలా భావిస్తాడో చెప్పు, నేను మరచిపోనారంభించాను" అని నెమ్మదిగా ఆ బాలిక అంటున్నట్టు గమనించారు.

ఈ పాఠం చదివే కొందరికి, విశ్వాసము కేవలం ఆరంభమైయుంటుంది. వృద్ధి చెందే ఈ విశ్వాసము కొన్నిసార్లు భయం కలిగించవచ్చు అదే సమయంలో మహా ఆనందంగా ఉండవచ్చు. ఇతరులకు విశ్వాసమనేది ఎక్కువ భాగం భూతకాలానికి సంబంధించినదై ఉంటుంది ఒకప్పుడు సజీవంగా ఉండి, యిప్పుడు దాదాపుగా

మృతమైనట్టు కన్పిస్తుంది. విశ్వాసమంటే ఎన్నడే ఎరుగనివారికిని, “మరచిపోనారంభించిన వారికిని” యోహాను సువార్త ఉద్దేశింపబడింది.

పునరుత్థానం విషయంలో నీ నిర్ణయమేమి? నీవు యేసునందు విశ్వాసముంచు చున్నావా? నీవు నమ్మబోతున్నావా? నీ విశ్వాసాన్ని నీవు సరిక్రొత్తదిగా చేసికొంటావా? ప్రతిదీ ఈ నిర్ణయం మీద ఆధారపడియుంటుంది!

---

సూచనలు

[1]యోహాను 11:16 తోమా ప్రభువునందు భక్తిగలిగియున్నాడనడానికి మంచి ఉదాహరణయై ఉంది.

[2]యోహాను సువార్త యొక్క ఏడు సూచక క్రియలు: నీటిని ద్రాక్షారసముగా మార్చడం (అధ్యాయం 2); అధికారి యొక్క కుమారుని బాగుచేయడం (4); బేతెస్ద కోనేటివద్ద కుంటివానిని స్వస్థపరచడం (5); అయిదువేల మందికి ఆహారం పెట్టడం (6); నీటిమీద నడవడం (6); పుట్టు గుడ్డివానిని బాగుచేయడం (9); లాజరును మృతులలోనుండి లేపడం (11). యోహాను సువార్త “ఏడు సూచక క్రియలతోను, మరియు అన్నిటికంటె అతి పెద్ద సూచక క్రియ (పునరుత్థానం)” అనేవాటితో కూడిందని చెప్పవచ్చు.

### యోహాను సువార్త యొక్క ఒప్పుకోలు

యోహాను సువార్తలో యేసుని గూర్చి ఒప్పుకున్న విషయాలు ఈ దిగువన ఇవ్వబడ్డాయి:

**నతనియేలు**: “–బోధకుడా, నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువు” (1:49).

**నీకొదేము**: “–బోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము” (3:2).

**మార్త**: “ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నాను” (11:27).

ఈ ఒప్పుకోలన్నియు ప్రాముఖ్యమైనవే. ఇవన్నియు విశ్వాసపు మార్గములో మెట్లయి ఉన్నాయి. ఏదియేలాగున్నా, తోమాయైతే, పునరుత్థానంపై ఆధారపడినవాడై, “నా ప్రభువా, నా దేవా” అని అనినప్పుడు బహు సంపూర్ణమైన ఒప్పుకోలును యిచ్చాడు (20:28).